క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో కె.కె.రాజు



కప్పస్తంభం వద్ద మొక్కుకుంటున్న ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు గురువారం సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి వారిని దర్శించుకున్నారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

రూ.2.5 లక్షల సీజ్

సీతమ్మధార: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి వివిధ రాజకీయ పార్టీల నాయకులు నగదు పంచుతుండగా.. రూ.2.5 లక్షలు పట్టుకున్నామని ఫోర్త్‌టౌన్ ఎస్.ఐ వెంకటరావు గురువారం తెలిపారు. పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: జోన్–2 సబ్ డివిజన్ పరిధిలో 11 కేవీ కరాస ఫీడర్, 11 కేవీ తెన్నేటినగర్ ఫీడర్, ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు న్యూ కరాస, ఓల్డ్ కరసా, తెన్నేటినగర్ ఫీడర్ పరిధిలోని కనకదుర్గా, ఫంక్షన్ హాల్ జంక్షన్, మాధవధార, గాయత్రి విద్యా మందిర రోడ్డు, జనతా గ్యారేజ్ జంక్షన్, గ్యాస్ గొడౌన్, తెన్నేటినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మురళీనగర్ సెక్షన్ పరిధిలో..

మురళీనగర్: జోన్–2 డివిజన్ మురళీనగర్ సెక్షన్ పరిధి అయ్యప్పనగర్ 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అయ్యప్పనగర్, వర్మా కాంప్లెక్స్ కూడలి ఏరియా, ఎన్‌జీజీవోస్ కాలనీ, సింగరాయిమెట్ట, మసీదు వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

18 నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం

డాబాగార్డెన్స్: ఈ నెల 18 నుంచి 21 వరకు కేరళ ఆయుర్వేద శిబిరం నిర్వహిస్తున్నట్టు వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు. కేరళ వైద్యుడు డాక్టర్ కె.ఎం.ఉన్నికృష్ణన్ నాయర్ మురళీనగర్ శ్రీదేవి పార్క్ సమీపాన గల తమ కేంద్రంలో అందుబాటులో ఉంటారన్నారు. 76758 61446, 0891–2568264 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



సందీప్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఆర్‌డీవో హుసేన్‌సాహెబ్

మహారాణిపేట: పెదగంట్యాడ మండల పరిధిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వై. సందీప్‌కు సంజీవని నిధి (డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్) ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందింది. కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు విశాఖ రెవెన్యూ డివిజన్ అధికారి డి. హుస్సేన్‌సాహెబ్ గురువారం సందీప్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. మందుల కొనుగోలు, ఇతర వైద్య ఖర్చుల నిమిత్తం సందీప్‌కు ఆర్థిక సాయం చేసినట్లు ఆర్డీవో తెలిపారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ. త్రినాథరావు కలెక్టర్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్య ప్రాప్తిరస్తు



49వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



53వ వార్డు శివనగర్‌లో కొత్త ఆరోగ్య కేంద్రం

- అత్యాధునికంగా ఆరోగ్య కేంద్రాలు
- ప్రజలకు చేరువగా వైద్య సేవలు

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో ఉత్తర నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువయ్యాయి. గత ప్రభుత్వంలో నియోజకవర్గంలో కేవలం నాలుగు ఆరోగ్య కేంద్రాలే ఉండగా.. రూ.40 లక్షలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాటిని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు(యూపీహెచ్‌సీ)గా ఆధునికీకరించి మెరుగైన వైద్య సేవలను ప్రజలకు అందిస్తోంది. రూ.5.18 కోట్లతో కొత్తగా మరో 6 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నియోజకవర్గంలో నిర్మించారు.

43వ వార్డు శ్రీనివాసనగర్ దాడి రామ్మూర్తి కల్యాణ మండపం(నరసింహనగర్)లో రూ.23.88 లక్షలతో, 48వ వార్డు జైభారత్‌నగర్(ఇందిరానగర్)లో రూ.1.06 కోట్లతో, 49వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో రూ.99.9 లక్షలతో, 50వ వార్డు మురళీనగర్‌లో రూ.42 లక్షలతో, 53వ వార్డు శివనగర్‌లో రూ.99.98 లక్షలతో, 54వ వార్డు ఐటీఐ జంక్షన్ సమీపంలోని భవానీ గార్డెన్స్‌లో రూ.1.06 కోట్లతో కొత్తగా ఆరోగ్య కేంద్రాలు నిర్మించారు. దీంతో మొత్తంగా 10 ఆరోగ్య కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రజలకు అన్ని రకాల వైద్య, రక్త పరీక్షలు ఇక్కడ జరుగుతున్నాయి. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



48వ వార్డు ఇందిరానగర్‌లో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



54వ వార్డు భవానీ గార్డెన్స్‌లో నిర్మించిన ఆరోగ్య కేంద్రం



ఆరోగ్య కేంద్రంలో మినీ వార్డు

కార్యకర్తల కష్టాన్ని ఎన్నటికీ మరువను



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు. చిత్రంలో ఎంపీ గొల్ల బాబూరావు, సనపల చంద్రమౌళి, చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, రొంగలి జగన్నాథం, పార్టీ నాయకులు

- నా గుండెలో ఉండేది ప్రజలు, పార్టీ శ్రేణులే
- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం కోసం ఎండనక, వాననక.. రేయింబవళ్లు పనిచేసిన కార్యకర్తల కష్టాన్ని ఎన్నటికీ మరువనని పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. బిర్లా జంక్షన్‌లోని బొత్స కన్వెన్షన్ హాల్‌లో గురువారం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావుతో పాటు ఇతర ప్రతినిధులు హాజరయ్యారు.

ప్రజలకు మేలు చేస్తున్న కె.కె.రాజు

ఈ సందర్భంగా గొల్ల బాబూరావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో కె.కె.రాజు ఓడినా.. ఎల్లప్పుడూ ప్రజలు, కార్యకర్తల మధ్యలోనే ఉంటూ వారి సమస్యలను తన సమస్యగా భావించి పరిష్కరించారన్నారు. గెలిచిన ఎమ్మెల్యే కంటే ఎక్కువగా ఐదేళ్ల పాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో నిమగ్నమయ్యారని కొనియాడారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, వారికి అందుబాటులో ఉండి తానున్నానంటూ కె.కె.రాజు ధైర్యం కల్పించారన్నారు. రాజ్యసభ నిధులతో ఉత్తర నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నాయకులు, కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు

కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా తనకు జన్మనిస్తే.. పునర్జన్మనిచ్చింది విశాఖ ఉత్తర నియోజకవర్గ ప్రజలు, నాయకులేనన్నారు. ఈ ఎన్నికల్లో తాను ప్రచారాల్లో బిజీగా ఉంటే.. మిగతా కార్యక్రమాల్లో వెనకుండి సహకరించిన నాయకులు, కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, ఉత్తర ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, వుడా మాజీ చైర్మన్ రవిరాజు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

19 నుంచి శ్రీనివాసుడి కల్యాణోత్సవాలు

నేడు ఆహ్వాన పత్రికల పంపిణీ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 22వ వార్షికోత్సవాల్లో భాగంగా శ్రీనివాసుని తిరు కల్యాణోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న ఉత్సవాలు ప్రారంభమై 23వ తేదీతో ముగుస్తాయన్నారు. ఈమేరకు శుక్రవారం కల్యాణ ఆహ్వాన పత్రికల పంపిణీ జరుగుతుందని చెప్పారు. 19వ తేదీ ఉదయం 5 గంటలకు వైభవుడికి సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాలభోగం, మంగళాశాసనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్‌గ్వరుణ, రక్షాసూత్రబంధన, మృత్సంగ్రహణం, అంకురార్పణ, పతాక ప్రతిష్ఠ, విశేష హోమాలు, మహానివేదన, మంగళాశాసనం, నిర్వహిస్తామని, సాయంత్రం 5 గంటలకు ఎదురు సన్నాహ ఉత్సవం అనంతరం 6 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవాన్ని చేస్తామని ఈవో వివరించారు. 20న ఉదయాస్తమాన సేవలతోపాటు 9 గంటలకు లక్ష మల్లెలతో అర్చన, సాయంత్రం 5 గంటలకు సదస్యోత్సవం నిర్వహిస్తారు. 21న ఉదయం 9 గంటలకు శ్రీవారికి చక్రస్నానం, వసంతోత్సవం, సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ, 22న ఉదయం తిరువీధి మహోత్సవం, 23న ఉదయం 6 గంటలకు వైభవుడికి పౌర్ణమి పంచామృతాభిషేకం అనంతరం సర్వాంగ వజ్రకవచంతో శ్రీవారి దర్శనం, 25న మధ్యాహ్నం నారాయణ సేవ నిర్వహిస్తామని ఈవో తెలిపారు.



19న బల్లిగిరి వెంకన్న తిరు కల్యాణోత్సవం

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం ఈ నెల 19వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. 18న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు.

బీసీజీ వ్యాక్సినేషన్ ప్రారంభం

సీతంపేట: క్షయ నివారణకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం గురువారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రారంభించారు. 43వ వార్డు శ్రీనివాసనగర్ దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో గల నరసింహనగర్ ఆరోగ్య కేంద్రంలో, 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో గల విద్యుత్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారుల పర్యవేక్షణలో వ్యాక్సినేషన్ ప్రారంభం అయింది. ఈ సందర్భంగా వైద్యాధికారి మనోజ్ మాట్లాడుతూ 2018 నుంచి 2022 వరకు టీబీ వ్యాధిగ్రస్తులుగా గుర్తింపబడిన వారు, 2021 నుంచి 2023 వరకు టీబీ వ్యాధిగ్రస్తుని ఇంట్లో ఉన్న 18 సంవత్సరాలు పైబడిన వారు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కిలోల కంటే తక్కువ ఉన్నవారు, షుగర్ వ్యాధి గ్రస్తులు, పొగాకు, బీడీ తాగే అలవాటు ఉన్న వారు, 60 సంవత్సరాలు పైబడిన వారంతా వ్యాక్సిన్ వేసుకోవాలన్నారు. ఈ వ్యాక్సిన్ ఉచితమని, ప్రతి సచివాలయం పరిధిలో వ్యాక్సినేషన్ జరుగుతుందని తెలిపారు.



నరసింహనగర్ యూపీహెచ్‌సీలో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఏటీఎం ధ్వంసం: స్పాట్‌లోనే నిందితుడి అరెస్ట్

సీతమ్మధార: డైమండ్ పార్కు దరి బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంను మద్యం తాగిన వ్యక్తి ధ్వంసం చేసిన ఘటన ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మధురవాడకు చెందిన మానేపల్లి మణికంఠ పూటుగా మద్యం సేవించి డైమండ్ పార్కు సమీపంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంలోకి ప్రవేశించాడు. నగదు దోచుకునేందుకు ఏటీఎంను పగలగొట్టడంతో స్థానికులు బ్యాంకు అధికారులు, పోలీసులకు సమాచారమిచ్చారు. ద్వారకా సీఐ ఎస్.రమేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని మణికంఠను అదుపులోకి తీసుకున్నారు. బ్యాంకు మేనేజర్ సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు మణికంఠను అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మణికంఠ ధ్వంసం చేసిన ఏటీఎం

10 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ద్వారకా స్టేషన్‌కు అప్పగించారు. వివరాలివీ.. కేరళ రాష్ట్రానికి చెందిన ప్రకాష్, సాయిదళవి ఒడిశాలో 10 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. కేరళ వెళ్లేందుకు విశాఖ వచ్చారు. రామాటాకీస్ రోడ్డులో బస్ కోసం వేచి ఉన్నారు. అయితే వీరిద్దరూ అనుమానాస్పదంగా కనిపించడంతో అటువైపు వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద గంజాయిని గుర్తించి.. ద్వారకా పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

19 నుంచి బంగారమ్మ, పోలమాంబ ఉత్సవాలు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 28వ వార్డులో వెలసిన బంగారమ్మ, పోలమాంబ ఉత్సవాలు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

బంగారమ్మ పండగ..

పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ పండగ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 21 వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పండగ చాటింపు చేపట్టనున్నారు. ఆ రోజు సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద స్టేజీ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. 20న సోమవారం తొలేళ్ల ఉత్సవం, సాయంత్రం 7 గంటల నుంచి స్టేజ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. 21న ప్రధాన పండగ జరపనున్నారు. ఉత్సవాల్లో గరిడీలు, కాళీ మాతా డ్యాన్స్‌లు, పులివేషాలు, తప్పిటగుళ్లు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నారు.

పోలమాంబ పండగ..

గొల్లలపాలెం గ్రామ ప్రజల ఆరాధ్యదైవం పోలమాంబ పండగ 19 నుంచి 21 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చాటింపు వేయనున్నారు. 20న తొలేళ్ల ఉత్సవం, 21న అనుపు కార్యక్రమం జరపనున్నారు. గొల్లలపాలెం, శెట్టిబలిజ సంఘం, బుద్ధలవానిపాలెం, రామ్‌నగర్, నెహ్రూనగర్, ఆది ఆంధ్ర గ్రామం, అశోక్‌నగర్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతవాసులు పోలమాంబను ఆరాధిస్తుంటారు.

ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ దూరం



ఎన్జీజీవోస్ కాలనీలో ర్యాలీ చేస్తున్న విద్యుత్‌నగర్ ఆరోగ్య కేంద్రం సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న రైల్వే న్యూకాలనీ ఆరోగ్య కేంద్రం సిబ్బంది

సీతంపేట: జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఉత్తర నియోజకవర్గంలోని అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. దోమలు పెరిగే ప్రదేశాలు, దోమల నియంత్రణకు, జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంచారు. హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు, జిల్లా మలేరియా విభాగం, జీవీఎంసీ మలేరియా విభాగం, యాంటీ లార్వా ఆపరేషన్స్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ వ్యాధిని దూరం చేయవచ్చని పిలుపునిచ్చారు.

డ్రైడే పాటించండి

నరసింహనగర్ ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారి మనోజ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ దోమలు నిల్వ ఉన్న మంచి నీరు, వర్షపు నీటిలో వృద్ధి చెందుతాయన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి నీటి నిల్వలను మార్చడం ద్వారా దోమల పెరుగుదలను నియంత్రించి, తద్వారా డెంగ్యూ వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

దోమ తెరలు వాడండి

అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని విద్యుత్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుధీర్ మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ దోమలు మంచినీటిలో పెరుగుతాయని, వారానికి ఒకరోజు డ్రై డేపాటించడం ద్వారా దోమల వృద్ధిని నియంత్రించవచ్చన్నారు. దోమల కాటు నుంచి రక్షణకు దోమ తెరలు వాడటం, శరీరాన్ని పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించాలని సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం నుంచి ఎన్జీజీవోస్ కాలనీలోని పలు ప్రాంతాల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎల్.శ్రీనివాసరావు, హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు, ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రావణి ప్రారంభించారు. రైల్వే న్యూకాలనీ పరిసర ప్రాంతాల్లో ర్యాలీ చేసి, స్థానికులపై డెంగ్యూ వ్యాధి నివారణపై అహగాహన కల్పించారు. ఆరోగ్యం కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణ మనందరి బాధ్యత

సీతమ్మధార: అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని జయప్రదం చేయాలని, జీవ వైవిధ్య పరిరక్షణ మన బాధ్యతగా స్వీకరించాలని సిఫా ట్రస్ట్ సీఈవో డాక్టర్ శశిప్రభ పిలుపునిచ్చారు. ఈ నెల 22న జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా గురువారం సీతమ్మధారలోని డాక్టర్ శశిప్రభ ఇంటి మేడ మీద మిద్దె తోటలో ప్రచార కార్యక్రమాన్ని సిఫా ట్రస్ట్, గ్రీన్ క్లైమెట్ టీం ఎన్‌జీవోలు ప్రారంభించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం–2024 ప్రణాళికలో మనమంతా భాగస్వాములు కావాలని కోరారు. జీవ వైవిధ్యం కోల్పోవడం వల్ల మన ఆరోగ్యంతో సహా అన్నింటికీ నష్టం వాటిల్లుతుందని వివరించారు. ఎకో వైజాగ్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మిద్దె తోటలు పెంచి ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం, గ్రీన్ అంబాసిడర్స్ ప్రతినిధి రామలక్ష్మి, యాక్షన్ ఎయిడ్ ఫెలోషిప్ ప్రతినిధి కృష్ణకుమారి, ఎస్.సి.ఫుడ్ అండ్ న్యూట్రిషియన్ సైన్స్ ఇంటెర్న్‌షిప్ విద్యార్థులు డి.సంధ్య, కె.భార్గవి, పి.హేమ దుర్గాభవాని, జి.విన్నీ, సిహెచ్.మౌనిక రాణి, ఐ.వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శశిప్రభ తదితరులు

పరదేశమ్మ పండగ పోస్టర్ ఆవిష్కరణ

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీల సరిహద్దులో వెలసిన పరదేశమ్మ పండగ మహోత్సవాలు ఈ నెల 20, 21 తేదీల్లో జరగనున్నాయి. వీటికి సంబంధించిన కరపత్రిక, పోస్టర్‌ను గురువారం పరదేశమ్మాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 20వ తేదీ సోమవారం తొలేళ్లు, 21వ తేదీ మంగళవారం ప్రధాన పండగ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తీన్‌మార్ బ్యాండు, రంగురంగుల విద్యుద్దీపాలంకరణలు, స్టేజ్ షోలు జరుగుతాయి. కరపత్రికావిష్కరణ కార్యక్రమంలో ఆలయ మాజీ అధ్యక్షుడు నూనెల పోలారావు, యడ్ల శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్, కరపత్రికలను ఆవిష్కరిస్తున్న నూనెల పోలారావు, యడ్ల శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యులు

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున ఆయా స్టేషన్ల నుంచి బయల్దేరాల్సిన రైళ్లు ఆలస్యంగా బయల్దేరుతున్నట్లు, అంతే ఆలస్యంగా ఈ రైళ్లు రాకపోకలు సాగించనున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలిపారు.



- విశాఖలో గురువారం రాత్రి 11.20 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం–లోకమాన్యతిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ సుమారు 4 గంటలు ఆలస్యంగా శుక్రవారం తెల్లవారు 3 గంటలకు బయల్దేరింది.
- సంత్రగచ్చిలో గురువారం రాత్రి 11.40 గంటలకు బయల్దేరాల్సిన సంత్రగచ్చి– తాంబరం (06090) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు నాలుగున్నర గంటలు ఆలస్యంగా శుక్రవారం తెల్లవారు 4 గంటలకు బయల్దేరింది.

ఆలస్యంగా వందేభారత్ రాకపోకలు

విశాఖపట్నం–సికింద్రాబాద్–విశాఖపట్నం (20833/20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ గురువా రం సుమారు మూడు గంటలు ఆలస్యంగా ఉదయం 8.45 గంటలకు విశాఖలో బయల్దేరింది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్‌లో సుమారు ఐదు గంటలు ఆలస్యంగా రాత్రి 8 గంటలకు బయల్దేరింది.